
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

జనగామ

ఆదివారం 14 జూలై 2024



స్టేషన్‌ఘన్‌పూర్‌లో వంద పడకల ఆస్పత్రికి ప్రతిపాదించిన స్థలం

వంద పడకల ఆస్పత్రికి వడివడిగా అడుగులు

దృష్టి సారించిన ఎమ్మెల్యే కడియం

స్టేషన్‌ఘన్‌పూర్ ప్రజలు ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఈ విషయంపై ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేకంగా దృష్టి సారించారు. బస్టాండ్ సమీపంలో ఉన్న నాలుగెకరాల ఆర్టీసీ స్థలాన్ని ఆస్పత్రికి కేటాయించాలని కోరుతూ ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదలను పంపారు. అధికారులతో కలిసి సంబంధిత స్థలాన్ని పరిశీలించారు. ముందుగా జాతీయ రహదారి నుంచి అక్కడి వరకు రోడ్డు నిర్మించేందుకు ఎస్టిమేషన్స్ సిద్ధం చేయాలని వారిని ఆదేశించారు. సర్కారు నుంచి అనుమతులు రాగానే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నారు.

- అనుమతులు కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- ఆర్టీసీ డిపో స్థలాన్ని కేటాయించాలని నిర్ణయం
- నాలుగెకరాల్లో భవన నిర్మాణానికి ప్రణాళికలు
- అధికారులతో కలసి స్థల పరిశీలన
- ముందుగా రోడ్డు వేసేందుకు ఎస్టిమేషన్ సిద్ధం

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 13: డివిజన్ కేంద్రంలో వంద పడకల ఆస్పత్రి ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. ఇందుకు గాను బస్టాండ్ సమీపంలో జాతీయ రహదారికి సమీపంలో ఆర్టీసీ డిపోకు కేటాయించిన స్థలాన్ని ఎంపికచేశారు. 2001లో అప్పటి మంత్రి, ప్రస్తుత స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆర్టీసీ డిపో ఏర్పాటుకు గాను ప్రైవేట్ వ్యక్తుల వద్ద నుంచి 4ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేశారు. ఆ స్థలం ఇప్పటికీ నిరుపయోగంగా ఉన్నందున అందులో 100 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఇటీవల ఆ స్థలాన్ని వైద్య ఆరోగ్యశాఖకు బదలాయించాలని ఆర్టీసీ సంస్థకు, సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. అంతేగాకుండా ఆస్పత్రి నిర్మాణం కోసం నిధులు, స్టాఫ్‌ను మంజూరి చేయాలని సీఎంకు వినతిపత్రం అందించారు. మరోవైపు అధికారులు ఆ స్థలంలో సర్వేలు నిర్వహించి హద్దులు సైతం ఏర్పాటు చేశారు. కొన్ని రోజుల క్రితం ఆర్డీవో ధరంసోత్ వెంకన్న ఆధ్వర్యంలోని రెవెన్యూ అధికారులు సిబ్బంది స్థలాన్ని సర్వేచేసి రిపోర్టులను ప్రభుత్వానికి అందించారు. ఈ స్థలం ఘన్‌పూర్ బస్టాండ్‌కు సమీపంలో ఉండడంతో పాటు జాతీయ రహదారికి 100 మీటర్ల దూరంలో ఉండడంతో ఆస్పత్రికి వచ్చే రోగులకు ఉపయుక్తంగా ఉండనుంది.



ఆస్పత్రి నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కడియం (ఫైల్)

గత ప్రభుత్వంలో విడుదలైన జీవో...

గత ప్రభుత్వంలో అప్పటి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీ‌ష్‌రావు ఘన్‌పూర్‌లో 100 పడకల ఏరియా ఆస్పత్రి ఏర్పాటు చేసేందుకు ఎన్నికల ముందు 2023 ఆగస్టు మాసంలో ఆదేశాలు ఇచ్చారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ విభాగం నుంచి జీవో ఆర్టీ నెంబరు 432ను విడుదల చేశారు. రూ 37.50 కోట్లతో ఆస్పత్రి నిర్మాణం (సివిల్ వర్క్స్), పరికరాలు, ఫర్నిచర్ ఏర్పాటు చేయాలని అందులో పేర్కొన్నారు. తదనంతరం ఎన్నికల నోటిఫికేషన్ రావడం.. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో పరిస్థితి మొదటికొచ్చింది.

ఆస్పత్రి స్థలాన్ని పరిశీలించిన కడియం...

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడం, ఎమ్మెల్యే కడియం శ్రీహరి బీఆర్ఎస్ నుంచి అందులో చేరడంతో ఆయన ఈ విషయంలో ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ఇందులో భాగంగా ఇటీవల రెవెన్యూ, వైద్యశాఖ అధికారులతో కలిసి స్థలాన్ని పర్యవేక్షించి ఇంజనీరింగ్ అధికారులకు ఆస్పత్రి స్థలం వరకు ఏర్పాటు చేయాల్సిన రోడ్డు నిర్మాణానికి అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. జాతీయ రహదారి నుంచి ఆస్పత్రి వరకు సూమారు 100 మీటర్ల రోడ్డును అన్ని అంగులాలతో రూపొందించేందుకు అధికారులు సుమారు రూ.80లక్షలతో అంచనా రూపొందించారు. 100 పీట్ల రోడ్డుతో పాటు ఇరువైపులా డ్రెయినేజీ నిర్మాణం, సెంట్రల్ గార్డెన్, లైటింగ్ ఏర్పాటు చేసేలా ప్రతిపాదలను సిద్ధం చేశారు.

ఆస్పత్రి ఏర్పాటుతో ప్రయోజనాలు..


వంద పడకల ఆస్పత్రి ఏర్పాటైతే డివిజన్ ప్రజలకు అనేక రకాల వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. వివిధ విభాగాలకు చెందిన వైద్యులు అందుబాటులోకి వస్తారు. గైనిక్, ఫిజీషియన్, సర్జన్, ఆర్థోపెడిక్, పిడియాట్రిక్, ఫిజియోథెరపీ, న్యూరో, డెంటల్, అనస్థీషియా వైద్యుల సేవలు అందుబాటులోకి వస్తాయి. అత్యవసర సేవల విభాగం అందుబాటులోకి వస్తుంది. అంతేగాకుండా ట్రామాకేర్ సెంటర్, బ్లడ్ బ్యాంకు, 24గంటల పాటు వైద్య సేవలు, అంబులెన్స్ సేవలు, అపరేషన్ థియేటర్స్, పోస్టుమార్టం సేవలు, ఎస్ఎన్‌సీయూ సేవలు అందుబాటులోకి వస్తాయి.

పనులు ప్రారంభించి చిత్తశుద్ధి చాటుకోవాలి

మాచర్ల గణేష్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు



గత ప్రభుత్వం హయాంలో ఇచ్చిన జీవోను అమలు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం తన చిత్తశుద్ధిని చాటుకోవాలి. వెంటనే ఆస్పత్రి నిర్మాణ పనులు ప్రారంభించాలి. ఈ విషయంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి చొరవ చూపాలి. ఇప్పటికే సరైన వైద్య సేవలు అందించడంలో ప్రస్తుత ప్రభుత్వం విఫలమైంది. ఇకనైనా ప్రజారోగ్యంపై దృష్టి పెట్టి అన్ని హంగులతో ఆస్పత్రిని ఏర్పాటు చేయాలి. అంతే గాకుండా అన్ని సదుపాయాలను కల్పిస్తూ అవసరమైన వైద్యులను, సిబ్బందిని నియమించాలి.



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

వరంగల్‌పై సీఎందీ నాదీ ఒకే విజన్!

- హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేయాలనేదే లక్ష్యం
- అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, ఎయిర్‌పోర్టు, రింగ్‌రోడ్డును పూర్తి చేస్తాం
- కాళోజీ కళాక్షేత్రం, వరంగల్ బస్టాండ్లను అందుబాటులోకి తీసుకొస్తాం
- 'కుడా' పరిధిని పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం
- త్వరలోనే అమల్లోకి కొత్త మాస్టర్ ప్లాన్
- పేదలకూ అందుబాటులో ఉండేలా కుడా లేఅవుట్ ప్లాట్లు
- ఎవరితో విబేధాల్లేవు.. కార్యకర్తలకు అండగా ఉంటా
- 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి

'వరంగల్ నగర అభివృద్ధి విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఏ విజన్‌తో ఉన్నారో.. నేనూ అదే విజన్‌తో ఉన్నా.. హైదరాబాద్‌కు దీటుగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు నగరానికి ఎంతో ప్రధానమైన అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, విమానాశ్రయం, రింగ్‌రోడ్డు నిర్మాణాల పూర్తి.. సాఫ్ట్‌వేర్ కంపెనీలను నెలకొల్పడమే లక్ష్యంగా పక్కా ప్రణాళికతో పని చేస్తాం. త్వరలోనే కొత్త మాస్టర్ ప్లాన్‌ను అమల్లోకి తెస్తాం. కాళోజీ కళాక్షేత్రాన్ని, కొంత్త బస్టాండ్ నిర్మాణాన్ని పూర్తి చేయిస్తాం. 'కుడా' ప్లాట్లను పేదలకు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు కుడా పరిధిని విస్తరించేందుకు చర్యలు తీసుకుంటాం' అని కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి స్పష్టం చేశారు. చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించి న ఆయన శనివారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలు వెల్లడించారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

7 లో..

ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తా

ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అమీర్ ఆలీఖాన్

జనగామ రూరల్ జూలై 13: జిల్లాలోని నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్ అన్నారు. ముస్లిం మైనారిటీ జిల్లా అధ్యక్షుడు జమాల్ షరీఫ్ అధ్యక్షతన శనివారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మైనారిటీ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ జనగామలో ఉన్న నిరుద్యోగుల కోసం కంపెనీలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గంజాయి విక్రయం, వినియోగాన్ని నిర్మూలించేందుకు పకడ్బందీగా చర్యలు చేపడుతోందన్నారు.

కొత్త పింఛన్లపై కోటి ఆశలు

- ఎదురు చూస్తున్న దివ్యాంగులు, వితంతువులు, వృద్ధులు
- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

వివరాలు 8వ పేజీలో..

వీధికుక్క దాడిలో బాలుడికి తీవ్ర గాయాలు



గాయపడిన బాలుడు వేదాంత్ (లక్కీ)

చిలుపూర్, జూలై 13 : వీధి కుక్క దాడిలో తొమ్మిదేళ్ల బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. చిలుపూర్ మండలం నష్కల్ గ్రామానికి చెందిన కనుకటి రాము-జ్యోతి దంపతుల కుమారుడు వేదాంత్ (లక్కీ) శనివారం తన స్నేహితులతో కలిసి ఇంటి ఎదుట ఆడుకుంటుండగా వీధికుక్క ఒక్కసారిగా బాలుడిపై దాడి చేసింది. ఎడమ చేతిని కరిచి తీవ్రంగా గాయపరచింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడిని వరంగల్ ఎంజీఎంకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

నిన్న పెంబర్తిలో.. నేడు నర్మెటలో..

గోడదూకి పారిపోతున్న విద్యార్థులు

నర్మెట, జూలై 13: హాస్టళ్లలో ఉండడం ఇష్టం లేక విద్యార్థులు పారిపోతున్నారు. ఈ నెల 11వ తేదీ రాత్రి 19 మంది విద్యార్థులు పెంబర్తిలోని జ్యోతీబా పూలే పాఠశాల గోడ దూకి పారిపోయిన విషయం తెలిసిందే. అదే తరహాలో శుక్రవారం అర్ధరాత్రి నర్మెట మండలం మాన్‌సింగ్‌తండాలో ఉన్న కస్తూర్బాగాంధీ పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థినులు పారిపోయారు. తమ సామానుతో పాటు స్వగ్రామాలకు కాలినడకన బయలుదేరారు. వారు దగ్గరలో ఉన్న ఆగాపేట గ్రామానికి చేరుకోగానే కల్యాణం వెంకటయ్య అనే వ్యక్తి వారిని గమనించి వివరాలు అడిగారు. పరిస్థితి తెలుసుకొని వారికి నచ్చిచెప్పి ఆ రాత్రి తన ఇంట్లో ఆశ్రయం ఇచ్చి ఉదయం కేజీబీవీ అధికారులకు, తల్లిదండ్రులకు సమాచారం అందించారు. దీంతో కస్తూర్బా ఎస్‌వో బి.రజిత, సిబ్బందితో పాటు విద్యార్థినుల తల్లిదండ్రులు వెంకటయ్య ఇంటికి వెళ్లి వారిని తిరిగి పాఠశాలకు తీసుకువెళ్లారు. అయినా తాము పాఠశాలలో ఉండటం ఇష్టం లేదని చెప్పడంతో తల్లిదండ్రులు వెంట తీసుకెళ్లారు.

రేపటి ప్రజావాణి కార్యక్రమం రద్దు

జనగామ రూరల్, జూలై 13: కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దయింది. ఈనెల 15 (సోమవారం)న హనుమకొండలో రైతు భరోసా పథకంపై నిర్వహించే సమీక్ష సమావేశానికి అధికారులు వెళ్లాల్సి ఉన్నందున ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ రిజ్వాన్ బాషా ప్రకటించారు.

ఒకే ఇంట్లో మళ్లీ మళ్లీ..

- ఇప్పగూడెంలో ఉపాధ్యాయుడి గృహంలో చోరీ
- రూ.2లక్షల విలువైన నగలు, రూ.10వేలు అపహరణ
- గతంలో రూ.3.50 లక్షల విలువైన నగలు మాయం

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 13: మండలంలోని ఇప్పగూడెం గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు యాతం రమేష్ ఇంట్లో దొంగలు చొరబడి బంగారు నగలతో పాటు నగదును ఎత్తుకెళ్లారు. అదే ఇంట్లో దొంగలు పడడం ఇది రెండోసారి. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రెండు రోజులు సెలవులు రావడంతో యాతం రమేష్-స్వరూప దంపతులు శుక్రవారం సాయంత్రం ఇంటికి తాళంవేసి హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఇదే అదనుగా భావించిన దొంగలు ఇంట్లో చొరబడి బీరువా తాళాలు పగులగొట్టి అందులో వస్తువులను చిందరవందర చేశారు. అందులో ఏమీ దొరకకపోవడంతో ఇళ్లంతా వడపోశారు. చివరికి కిచెన్ రూమ్ డబ్బాలో దాచిన బంగారు చైన్, కమ్మలు, బుట్టాలు, ఉంగరం మొత్తంగా రూ.2లక్షల విలువైన మూడు తులాల బంగారు నగలతో పాటు రూ.10వేల నగదును ఎత్తుకెళ్లారు. శనివారం మధ్యాహ్నం అటువైపు వెళ్లిన స్థానికులు ఇంటి తలుపులు తీసి ఉండడం గమనించి రమేష్‌కు సమాచారం ఇచ్చారు. వారు శనివారం సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా ఇంట్లోని బీరువా తలుపులు తీసి ఉండడంతో పాటు ఇంట్లోని వస్తువులను చిందరవందర చేశారు. ప్రతీ గదిలో వస్తువులను కిందపడవేసి బీభత్సం సృష్టించారు. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ ముస్కు రాజు, ఎస్సైలు నాగరాజు, వినయ్ కుమార్ వచ్చి దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం క్లూస్‌టీమ్ అక్కడికి చేరుకొని వేలిముద్రలు సేకరించారు.



దొంగలు ఓపెన్ చేసిన బీరువాలు

గత సంవత్సరం ఇదే నెలలో చోరీ..

ప్రభుత్వ ఉపాధ్యాయుడు యాతం రమేష్ ఇంట్లో గత ఏడాది సైతం ఇదే నెలలో చోరీ జరిగింది. అప్పుడు కూడా వారు ఇలాగే హైదరాబాద్ వెళ్లి తిరిగి వచ్చేసరికి బీరువాలో 5తులాల బంగారు నగలతో పాటు, 50తులాల వెండి అభరణాలను (రూ.3.5లక్షల విలువైన నగలు) దొంగలు ఎత్తుకెళ్లారు.

ఈ సందర్భంగా బాధిత దంపతులు మాట్లాడుతూ గత సంవత్సరం కూడా ఇలాగే చోరీ జరిగిందని, అప్పటి నగలు ఇంతవరకు రికవరీ కాలేదని, ఆ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని ఈసారి నగలను బీరువాలో కాకుండా కిచెన్‌రూమ్‌లో దాచిపెట్టామని, అయినా వాటిని వెతికి పట్టుకొని తీసుకెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు పకడ్బందీగా విచారణ చేసి నగలు రికవరీ చేయాలని కోరారు.

ఎంజేపీని సందర్శించిన అధికారులు



ఎంజేపీలో విచారణ జరుపుతున్న ఆర్‌సీవో తదితరులు

జనగామ కల్చరల్, జూలై 13: విద్యార్థులు గోడదూకి పారిపోయిన సంఘటనపై ప్రాంతీయ సమన్వయ అధికారి (ఆర్‌సీవో) మనోహర్‌రెడ్డి విచారణ జరిపారు. శనివారం ఆయన పెంబర్తిలోని (బచ్చన్నపేట) జ్యోతిబాపూలే విద్యాలయాన్ని సందర్శించారు. జనగామలోని జ్యోతిబా పూలే విద్యాలయం నుంచి 8, 9 తరగతులకు చెందిన విద్యార్థులను

విద్యార్థులు పారిపోయిన ఘటనపై విచారణ

పెంబర్తిలోని జ్యోతిబాపూలే విద్యాలయానికి మార్చగా ఈ నెల 11వ తేదీ రాత్రి 19 మంది విద్యార్థులు పాఠశాల గోడ దూకి పారిపోయారు. ఈ విషయమై విద్యార్థుల తల్లిదండ్రులు ఈ నెల 12న జనగామ లోని జ్యోతి బాపూలే విద్యాలయం ఎదుట ఆందోళన చేపట్టగా ఈ సంఘటనపై జాయింట్ సెక్రటరీ డి.తిరుపతి, ప్రాంతీయ సమన్వయ అధికారి మనోహర్‌రెడ్డి, జిల్లా సమన్వయ అధికారి అనిత విచారణ చేపట్టారు. విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పాఠశాల ఊరికి దూరంగా ఉండటంతో విద్యార్థులు కొంత అసౌకర్యానికి గురై ఇక్కడ ఉండలేక గోడ దూకి పారిపోయారని, అంతేగాని పెంబర్తిలో ఎలాంటి ర్యాగింగ్ జరుగలేదని స్పష్టం చేశారు. అదేవిధంగా సంబంధిత టీచర్‌ను పాఠశాల నుంచి తొలగించామన్నారు. అదే విధంగా విద్యార్థుల సమస్యలను వారం రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను తిరిగి పంపించడానికి అంగీకరించారు.

ఘోర రోడ్డు ప్రమాదం

- గేదె కళేబరాన్ని తప్పించబోయి కంటైనర్‌ను ఢీకొట్టిన ఆటో
- దంపతులు, కూతురు, డ్రైవర్ దుర్మరణం
- మరొకరికి తీవ్ర గాయాలు
- కూతురిని బస్సు ఎక్కించేందుకు వెళ్తుండగా ఘటన



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సత్యనారాయణరాజు (ఫైల్), సత్యవతి (ఫైల్), డ్రైవర్ నాగరాజు (ఫైల్)

వివరాలు 7వ పేజీలో...

ఇండస్ట్రియల్ కారిడార్‌గా అభివృద్ధి చేసేందుకు కృషి

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- మడికొండలో వర్ధన్నపేట కాంగ్రెస్ నాయకుల ఆత్మీయ సన్మానం

8లో



మడికొండ సత్యసాయి కన్వెన్షన్‌లో జరిగిన సన్మాన సభలో మాట్లాడుతున్న ఎంపీ కడియం కావ్య

ముదిరాజ్ కులస్థులను బీసీ ఏలో చేర్చాలి

ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్

హనుమకొండ చౌరస్తా, జూలై 13: రాష్ట్ర ప్రభుత్వం ముదిరాజ్ కులస్థుల అభివృద్ధికి కృషి చేయడంతో పాటు బీసీ ఏలో చేర్చాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ కోరారు. హనుమకొండ 10వ డివిజన్ మచిలీబజార్‌లోని తెలంగాణ ముదిరాజ్ మహాసభ కమ్యూనిటీ హాల్‌లో శనివారం జిల్లా ప్రధాన కార్యదర్శి పులి రజనీకాంత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో అశోక్ పాల్గొని ముందుగా మహాసభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ పిలుపు మేరకు బీసీ డీలో ఉన్న ముదిరాజ్‌లను బీసీ ఏలోకి చేర్చాలనే నినాదంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ముదిరాజ్ కులస్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 15నుంచి 20వరకు జిల్లాలోని రెవెన్యూ అధికారులను కలిసి వినతిపత్రాలు అందించే కార్యక్రమం నిర్వహించనున్నట్లు అశోక్ తెలిపారు.

పులి రజనీకాంత్ మాట్లాడుతూ.. తెలంగాణలో అత్యంత ప్రాచీన, అధిక జనాభా గల కులమైన ముదిరాజ్, తెనుగోళ్లు, ముత్తరాసి అయిన తాము.. సమాజంలో అన్ని రంగాలలో వెనుకబడి ఉన్నామన్నారు. ముదిరాజ్ అభివృద్ధి కోసం కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్‌ను ఏర్పాటు చేసి యేటా రూ.1000కోట్ల నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. మత్స్యశాఖలోని సొసైటీలకు ఎన్నికలు జరపాలని, అదే విధంగా ఆసరా పింఛన్ సౌకర్యాలను కల్పించాలని, ప్రత్యేక గురుకుల పాఠశాలలు ఏర్పాటుతో పాటు ఉచితంగా చేప పిల్లల పంపిణీ పథకాన్ని కొనసాగించాలన్నారు. అధికార పార్టీలో ఎమ్మెల్యేలుగా ఉన్న ముదిరాజ్ కుల బంధువులకు మంత్రివర్గంలో స్థానం కల్పించడంతో పాటు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని రజనీకాంత్ కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ సభ్యులు చొప్పరి సోమయ్య, ఎన్ఆర్‌వి రాజ్‌కుమార్, పిట్టల సత్యనారాయణ, రవికుమార్, మహేందర్, బయ్య శోభన్, పులి మధు, కుమారస్వామి, సారంగపాణి, సాంబమూర్తి, విక్రమ్, బుచ్చిరాజు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



ముదిరాజ్‌ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏర్పాటు చేసిన వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ముదిరాజ్ కులస్థులు

రూ.2లక్షల గుట్కా పట్టివేత



పట్టుకున్న గుట్కాతో పోలీసులు

వరంగల్ క్రైం, జూలై 13: వరంగల్ ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కేబీహెచ్‌ఎస్ కాలనీలో రూ.2లక్షల విలువైన గుట్కాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. కాలనీలో నాగరాజు అనే వ్యక్తి వద్ద గుట్కా నిల్వలు ఉన్నట్లు సమాచారం అందుకుని టాస్క్‌ఫోర్స్ సీఐ రవికుమార్ తన సిబ్బందితో కలిసి శనివారం దాడులు చేశారు. దాడిలో నిషేధిత గుట్కాను స్వాధీనం చేసుకుని నాగరాజును అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం ఇంతేజార్‌గంజ్ పోలీసులకు అప్పగించారు.

కేయూలో సైన్స్ పీజీ కోర్సుల తరగతులు షురూ..

కేయూ క్యాంపస్, జూలై 13: కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం పీజీ సైన్స్ కోర్సుల మొదటి సెమిస్టర్ తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. జంతుశాస్త్ర విభాగం సెమినార్ హాల్‌లో జరిగిన ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి మాట్లాడారు. కేయూలో ఈ ఏడాది దూరవిద్య కేంద్రంలో పీజీ కోర్సుల్లో అడ్మిషన్లు బాగా పెరిగాయని చెప్పారు. జువాలజీ, బాటనీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, గణితశాస్త్రం కోర్సుల్లో స్టడీ మెటీరియల్‌ను అందచేస్తామని చెప్పారు. విద్యార్థులు తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం మాట్లాడుతూ.. థియరీ క్లాస్‌లకు విద్యార్థులకు రెగ్యులర్‌గా హాజరుకావాలని, తర్వాత ప్రాక్టికల్స్ క్లాస్‌లు నిర్వహిస్తామని చెప్పారు. వర్సిటీలో మొదటిదఫాగా యూజీసీ డెబ్ ఆదేశాల మేరకు సెమిస్టర్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఎస్డీఎల్‌సీఈ సైన్స్ కోర్సుల సహ సంచాలకుడు డాక్టర్ వెంకటగోపీనాథ్ మాట్లాడుతూ.. రెగ్యులర్ కోర్సులకు దీటుగా దూరవిద్య విధానంలో తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సైన్స్ విభాగాల అధిపులు డాక్టర్ భారవీశర్మ, డాక్టర్ మంజుల, డాక్టర్ ఇస్తారీ, డాక్టర్ లలితకుమారి, డాక్టర్ ముస్తాఫా, డాక్టర్ జ్యోతి, డాక్టర్ హన్మంతు తదితర విద్యార్థులు పాల్గొన్నారు.



హాజరైన ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, ఇతర అధ్యాపకులు

వరంగల్‌పై సీఎంది నాదీ ఒకే విజన్

హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేయాలనేదే లక్ష్యం : 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి

ఇంటర్వ్యూ INTERVIEW

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

హైదరాబాద్‌కు ధీటుగా వరంగల్‌ను అభివృద్ధి చేయాలనే సీఎం రేవంత్‌రెడ్డి విజనే తన విజన్‌గా పని చేస్తానని, ఎయిర్‌పోర్టు, నగరంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీని తీసుకరావటంతో పాటు రింగ్ రోడ్, సాఫ్ట్‌వేర్ కంపెనీలను నెలకొల్పడం లక్ష్యంగా ప్రణాళిక రూపొందిస్తున్నామని కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ (కుడా) నూతన చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి స్పష్టం చేశారు. శనివారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన కుడా అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను వెల్లడించారు. పేదలకు కుడా ప్లాట్లను అందుబాటులోకి తీసుకరాడటంతో పాటు కూడా పరిధిని విస్తరించటం.. కాళోజీ కళాక్షేత్రం, వరంగల్ బస్టాండ్ నిర్మాణం, నగరంలో జంక్షన్‌ల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానన్నారు.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి: కుడా చైర్మన్‌గా ఎంపిక కావటంపై మీ స్పందన?

ఇనుగాల వెంకట్రామిరెడ్డి: కాంగ్రెస్‌లో ఓ సాధారణ కార్యకర్తగా.. పార్టీ ఏ కార్యక్రమం ఇచ్చినా విజయవంతంగా పని చేశా. 2014 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయినా ప్రజల్లోనే ఉన్నా. 2018, 2023లో కొన్ని కారణాల వల్ల పార్టీ టికెట్ ఇవ్వకపోయినా పార్టీ అభ్యున్నతికి కృషి చేశా. రేవంత్‌రెడ్డి పాదయాత్రతో పాటు ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో శక్తివంచన లేకుండా కృషి చేశా. ఇవన్నీ సీఎం రేవంత్‌రెడ్డి గుర్తించి కూడా చైర్మన్ పదవిని అప్పగించారు. ఈ రెండేళ్ల కాలంలో వరంగల్ కుడా పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు కాంగ్రెస్ కార్యకర్తల కష్టాసుఖాల్లో పాలుపంచుకుంటా. ప్రజలకు సేవ చేసేందుకు కూడా చైర్మన్ పదవి దక్కింది. తప్పకుండా సీఎం సహకారంతో కుడా పరిధిలో నా మార్కు అభివృద్ధి ఉండేలా పని చేస్తా.

ఆంధ్రజ్యోతి: కుడా చైర్మన్‌గా మీ విజన్ ఏంటి?

వెంకట్రామిరెడ్డి: సీఎం రేవంత్‌రెడ్డికి వరంగల్‌ను హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేయాలనే పట్టు దలతో ఉన్నారు. ఆయన ఏ విజన్‌తో ఉన్నారో నేనూ అదే విజన్‌గా పని చేస్తా. ప్రధానంగా వరంగల్‌కు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పూర్తి చేయటం లక్ష్యంగా పెట్టుకున్నాం. అలాగే ఎయిర్‌పోర్టుకు దారిని విస్తరించడంతో పాటు త్వరలోనే వరంగల్ మామునూరు నుంచి విమానాలు ఎగిరేలా పని చేస్తున్నాం. ఇప్పటికే చాలా వరకు పూర్తి అయినా రింగ్‌రోడ్డు పనులు ఇంకో ఐదారు కిలో మీటర్ల వరకు మిగిలి ఉంది. దీనికి కావాల్సిన రూ.300కోట్ల వరకు సీఎం మంజూరుకు హామీ ఇచ్చారు. త్వరలోనే రింగ్‌రోడ్డును పూర్తి చేస్తాం. ప్రస్తుతం కూడా ఆధ్వరంలో మూడు వెంచర్లున్నాయి. వాటిలో పేదలు ప్లాట్లు కొనేలా అభివృద్ధి చేస్తున్నాం. నగరం చుట్టూ అనధికారిక ప్లాట్లు భారీగా ఏర్పాటు చేశారు. వాటిని గుర్తించి లేఅవుట్‌లుగా మార్చేలా ప్రయత్నాలు చేస్తాం. నాన్ లేఅవుట్ ప్లాట్లలో ప్లాట్ కొనుగోలు చేయకుండా ప్రజల్లో అవగాహన తీసుకవస్తాం. ఫామ్ ల్యాండ్ పేరుతో జరుగుతున్న భూక్రయ విక్రయాలపై దృష్టి పెడుతున్నాం.

ఆంధ్రజ్యోతి: హైదరాబాద్‌కు దీటుగా అంటే ఎలాంటి అభివృద్ధి చేస్తారు?

వెంకట్రామిరెడ్డి: హైదరాబాద్ నగరంలో ఉన్న సౌకర్యాలు వరంగల్ వాసులకు తీసుకరావటం ప్రధానం. అలాగే వరంగల్‌లో ఇంటర్నేషనల్ స్టేడియం ఏర్పాటుకు పలు సంస్థలు ముందుకు వస్తున్నాయి. దీన్ని పూర్తి చేస్తే అంతర్జాతీయ క్రీడలు ఇక్కడే నిర్వహిస్తారు. 50 ఎకరాల్లో కొత్తగా స్టేడియం ఏర్పాటు చేసి వరంగల్‌ను స్పోర్ట్స్ సిటీగా అభివృద్ధి చేయాలనేది నా లక్ష్యం. అలాగే మెడికల్ హబ్‌గా వరంగల్‌ను హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేస్తాం. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రతో పాటు చుట్టు పక్కల జిల్లాల నుంచి ప్రజలు వైద్యం కోసం వరంగల్‌కు వచ్చేలా సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉంది. ఇందుకు కావాల్సిన భూమిని కూడా సమకూర్చుతుంది. ఐటీ కంపెనీలను వరంగల్‌కు తీసుక వచ్చేందుకు దృష్టి పెడుతున్నాం. మడికొండ ఏరియాలో డంపింగ్ యార్డు నుంచి చెత్త ద్వారా విద్యుత్ ఉత్పత్తికి ప్లాన్ చేస్తున్నాం. దీంతో ఐటీ కంపెనీల ఏర్పాటుకు చాల వరకు ఆటంకాలు లేకుండా పోతుంది.

ఆంధ్రజ్యోతి: కుడా చేపట్టిన పనుల్లో పురోగతి ఎలా ఉంది?

వెంకట్రామిరెడ్డి: కుడా ఆధ్వర్యంలో ప్రజలకు దీర్ఘకాలికంగా ప్రయోజనం ఉండే పనులపై దృష్టి పెట్టాం. గత ప్రభుత్వం అంచనాలు లేకుండా కొన్ని పనులు చేపట్టి మధ్యలోనే వదిలేసింది. వాటిలో ప్రధానంగా బాలసముద్రంలో కాళోజీ కళాక్షేత్రాన్ని రూ.90కోట్లతో చేపట్టి నిధులు లేక మధ్యలోనే వదిలేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో కాళోజీ కళాక్షేత్రాన్ని సెప్టెంబరు 9వ తేదీలోపు పూర్తి చేసేలా పనుల్లో వేగం పెంచాం. ఇప్పటి వరకు 80శాతం పనులు చేశాం. అలాగే వరంగల్ బస్టాండ్‌కు రూ.250కోట్లు కేటాయించాం. మొదటి విడతలో రూ.125 కోట్లతో చేపట్టే పనులను కుడా ఆధ్వర్యంలో ప్రారంభించారం. మోడల్ బస్టాండ్‌గా అభివృద్ధి చేస్తాం. వరంగల్ ఓ సిటీ ఏరియాలో కుడా 8 ఎకరాల వరకు భూమి ఉంది. ఈ భూమిని ఏలా అభివృద్ధి చేయాలో స్థానిక మంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. వరంగల్ మహానగరంలో జంక్షన్ల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి పెడుతున్నాం.

ఆంధ్రజ్యోతి: కుడా పరిధి పెంచటం.. మాస్టర్ ప్లాన్‌పై మీ వైఖరి?

వెంకట్రామిరెడ్డి: కుడా పరిధిని కచ్చితంగా పెంచుతాం. ప్రస్తుతం కుడా పరిధిలో 180 గ్రామాలున్నాయి. సుమారు 25కిలో మీటర్ల వరకే కుడా విస్తరించి ఉంది. దీన్ని ఎంత మేర పెంచాలనే దానిపై మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల అభిప్రాయాలను తీసుకుని నిర్ణయం తీసుకుంటాం. గత ప్రభుత్వం తీసుకవచ్చిన మాస్టర్ ప్లాన్‌ను మారుస్తున్నాం. సీఎం ఆదేశాల మేరకు 2050 వరకు ఉపయోగపడేలా కొత్త మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తున్నాం. మరో మూడు, నాలుగు నెలల్లో దాన్ని అమలు చేస్తాం.

ఆంధ్రజ్యోతి: వ్యాపారంలో స్థిరపడిన మీరు రాజకీయాల్లోకి రావాలని ఎందుకనుకున్నారు?

వెంకట్రామిరెడ్డి: మా కుటుంబం వ్యాపార పరంగా స్థిరపడింది. మా ఒక్క కూతురూ కెనడాలో ఉన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు ఉపాధ్యక్షుడిగా, డక్కన్ క్రానికల్ సీఈవోగా పని చేశా. 2012లో పరకాల ఎమ్మెల్యే కొండా సురేఖ వైసీపీలోకి వెళ్లటంతో నాటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డితో ఉన్న సత్సంబంధాలతో ఆయన పరకాల రాజకీయాల్లోకి పంపారు. ఆ తరువాత సొంత గడ్డపై ప్రజలకు సేవల చేయాలనే లక్ష్యంతో 2013 సహకార ఎన్నికల్లో పోటీ చేశా. ఇక ఖమ్మం శారద కాలేజీలో స్టూడెంట్ ఉన్నప్పుడు లీడర్‌గా పని చేసిన అనుభవం ఉండటంతో రాజకీయాల్లో సులభంగానే నెట్టుకవచ్చాను. 2023లో కూడా కొత్తవారికి అవకాశం ఇవ్వాలని అధిష్ఠానం ఆదేశిస్తే పోటీ నుంచి తప్పుకున్నా. వచ్చే అసెంబ్లీ ఎన్నికల వరకు నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుంది. ఆ సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి తీసుకునే నిర్ణయంపై పోటీ గురించి ఆలోచిస్తా. పరకాల ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి, మంత్రి సురేఖతో సహా ఎవరితోనూ ఎలాంటి విబేధాలు లేవు. అందరితో కలిసి పని చేస్తా. ఈ రోజు కుడా కుర్చీలో కూర్చున్నానంటే అది కేవలం కార్యకర్తల కష్టఫలమే. వారికి అండగా ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తా.





రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ కోసం ప్రశ్నిస్తా..

- వరంగల్ ఎంపీ కడియం కావ్య
- రైల్వే సమస్యలపై టీ రైల్వే జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కడియం కావ్య

కాజీపేట, జూలై 13: కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ సాధనకోసం కేంద్ర ప్రభుత్వాన్ని ఎన్నిసార్లైనా ప్రశ్నిస్తానని, డివిజన్ సాధనే లక్ష్యం పని చేస్తేనే తన రాజకీయ జీవితానికి సార్థకం అవుతుందని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. రైల్వే సమస్యల పరిష్కారానికి తెలంగాణ రైల్వేఎంప్లాయీస్ జేఏసీలో తనకు కూడా సభ్యత్వం ఇవ్వాలన్నారు. కాజీపేట రైల్వే కమ్యూనిటీ హాల్‌లో తెలంగాణ రైల్వే ఎంప్లాయీస్ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం రైల్వే సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది.. జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా ఎంపీ కడియం కావ్య పాల్గొని మాట్లాడారు. వరంగల్ ఎంపీగా ప్రతీ సమస్యపై పోరాటం చేస్తానన్నారు. ఒక ఏడాదిలో పలు సమస్యలపై పార్లమెంట్‌లో పదిసార్లు మాట్లాడిన కడియం శ్రీహరి బిడ్డగా సమస్యల పరిష్కారానికి పార్లమెంట్‌లో తనగొంతు వినిపిస్తానని ఉద్వేగంగా ప్రసంగించారు. కాజీపేటలో ప్లాట్‌ఫారాల విస్తరణ, లోకోపైలెట్‌ల సమస్యలు, రైల్వేలో ప్రైవేటీకరణ అడ్డుకోవడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఆర్ఎస్ఎస్ ముసుగులో ప్రధాని మోదీ రిజర్వేషన్‌లు ఎత్తివేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అంబేద్కర్ అన్ని వర్గాలకు న్యాయం చేశారని గుర్తుచేశారు. రాహుల్ గాంధీకి అన్ని సమస్యలపై అవగాహన ఉందన్నారు. రైల్వే బడ్జెట్‌లో కాజీపేటకు వాటా వచ్చే వరకు నిరంతర పోరాటం చేస్తానన్నారు. సమస్యల పరిష్కారానికి ఎవరికీ భయపడే ప్రసక్తేలేదన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. కాజీపేటకు రైల్వేపరంగా కేంద్రం నుంచి న్యాయం జరగాలంటే తెలంగాణ ఎంపీలతో టీరైల్వే జేఏసీ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. రైల్వేలో ఉద్యోగాలు మన పిల్లలకు దక్కాలంటే రైల్వే పోటీ పరీక్షల్లో అర్హత సాధించే విధంగా చదవాలన్నారు. ఆర్ఆర్‌బీ, ఆర్ఆర్‌సీ పరిధిలోనే పరీక్షలు నిర్వహించాలన్నారు. రైల్వే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిందేనన్నారు. రైల్వేపరంగా కాజీపేటకు రావాల్సిన విషయాలపై ప్రత్యేక నివేదికను రూపొందించాలని జేఏసీ నాయకులకు సూచించారు. కాజీపేటలో అదనపు ఆర్వోబీని ఆరునెలల్లో అందుబాటులోకి తెస్తామన్నారు. ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. రైల్వే వ్యాగన్ పరిశ్రమలో భూమి కోల్పోయిన రైతులకు సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి రూ.5కోట్ల నష్టపరిహారం ఇప్పించానని చెప్పారు. పెన్షనర్ల కార్యాలయానికి స్థలం ఇప్పిస్తానని హామీ ఇచ్చారు.

అంతకు ముందు మజ్దూర్ యూనియన్ డివిజనల్ సెక్రటరీ పిల్లలమర్రి రవీందర్, జోనల్ అధ్యక్షుడు కాల్వ శ్రీనివాస్, ఆలిండియా ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షుడు బి.వీరన్న, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. సంగమయ్య, కృష్ణమూర్తి, సంఘ్ సీడబ్ల్యూసీ మెంబర్ సీహెచ్ మరళి, సంఘ్ డివిజనల్ అధ్యక్షుడు కొత్త మురళి, రైల్వే జేఏసీ చైర్మన్ కొండ్ర నర్సింగరావు, కోశాధికారి సీహెచ్ తిరుపతి, ఆల్ బ్రాంచ్ కో-ఆర్డినేటర్ నాయిని సదానందం, స్థానిక కార్పొరేటర్‌లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీతోపాటు పలువురు నాయకులు రైల్వే సమస్యలపై చర్చించి రైల్వే పరిశ్రమల సాధన, తదితర విషయాలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చారు. సుమారు మూడు గంటలపాటు జరిగిన ఈ రౌండ్‌టేబుల్ చర్చా వేదికలో రైల్వే కార్మికులు, కాంగ్రెస్ నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఏటూరునాగారంలో ఘోర రోడ్డు ప్రమాదం

గేదె కళేబరాన్ని తప్పించబోయి కంటైనర్‌ను ఢీకొట్టిన ఆటో

దంపతులు, కూతురు సహా ఆటోడ్రైవర్ దుర్మరణం

మరొకరికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన ఆటో

ఏటూరునాగారం రూరల్, జూలై 13 : రోడ్డుకు అడ్డంగా ఉన్న గేదె కళాబరాన్ని తప్పించబోయి కంటైనర్‌ను ఆటో ఢీ కొట్టడంతో దంపతులతోపాటు వారి కూతురు, ఆటోడ్రైవర్ మృతిచెందిన సంఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో శనివారం రాత్రి జరిగింది. ఆటోడ్రైవర్‌కు తోడుగా వచ్చిన మరో వ్యక్తి గాయాలపాలయ్యాడు. కూతురిని బస్సు ఎక్కించేందుకు ఆ దంపతులు తమ గ్రామానికి చెందిన ఓ ఆటోను కిరాయికి తీసుకుని బయల్దేరిన క్రమంలో ఈ దుర్ఘటన జరిగింది.

ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రానికి చెందిన కాకర్లపూడి సత్యనారాయణరాజు(72), కాకర్లపూడి సత్యవతి(65) దంపతులు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తునిలో నివాసముంటున్న తన కూతురు సాగిరాజు అనిత (45)ను ఆమె ఊరికి పంపించేందుకు వాజేడు నుంచి ఏటూరునాగారంనకు శనివారం రాత్రి బయల్దేరారు. ఈ క్రమంలో వాజేడుకు చెందిన తలాండి నాగరాజుకు చెందిన ఆటోను కిరాయికి మాట్లాడుకోగా.. ఆటోలో వీరి ముగ్గురితో పాటు డ్రైవర్ నాగరాజుకు తోడుగా ఉండేందుకు అంజిరెడ్డి అనే మరోవ్యక్తి కూడా వచ్చాడు. వారి ఆటో ఏటూరునాగారం వస్తున్న క్రమంలో 163వ జాతీయరహదారిపై హైటెక్ సమీపంలో రోడ్డుపై ఓ పాడిగేదే మరణించి ఉంది. ఆ కళేబరాన్ని తప్పించబోయి ఆటో ఎదురుగా వాజేడు వైపు వెళ్తున్న కంటైనర్‌ను ఢీకొట్టి ఆటో బోల్తా కొట్టింది. దీంతో కాకర్లపూడి సత్యనారాయణరాజు, కాకర్లపూడి సత్యవతితో పాటు డ్రైవర్ నాగరాజు అక్కడికక్కడే మృతి చెందగా సాగిరాజు అనిత, అంజిరెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే వారిని తొలుత మండలకేంద్రంలోని సామాజిక ఆసుపత్రికి, అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స అందిస్తున్న క్రమంలో మృతి చెందింది.

సత్యనారాయణరాజు, సత్య వతి, నాగరాజు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ములుగు జిల్లా ఆసుపత్రికి తర లించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. ఇదిలా ఉంటే ప్రమాదం అనంతరం కంటైనర్ డ్రైవర్ వాహనంతో సహా పారితుండగా వాజేడు మండలం జగన్నాథపురానికి చెందిన వారు ఆ కంటైనర్‌ను అడ్డుకోగా వాహనాన్ని వదిలేసి డ్రైవర్ పరారయ్యాడు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన అనిత



చికిత్స పొందుతున్న అంజిరెడ్డి

కళ్లల్లో కోనోకార్పస్ మంట!

ఏడాకుల చెట్లతో ఇబ్బందిపడుతున్న వాహనదారులు

వెంటనే తొలగించాలని అధికారులకు వేడుకోలు



నెల్లుట్లలో జాతీయ రహదారి డివైడర్ మధ్యలో ఉన్న కోనోకార్పస్ చెట్లు

లింగాలఘణపురం, జూలై 13: ఆకుపచ్చని సోయగాలు.. సుందరీకరణ సొగసులను ఒలకబోస్తూ రోడ్లకు ఇరువైపులా నన్ను చూడు.. నా అందం చూడంటూ ఫోజులిచ్చే కోనోకార్పస్ చెట్లు వాహనదారుల కళ్లలో మంట పెడుతున్నాయి. చూసేందుకు ఏం చక్కా బాగున్నాయనిపించే ఈ చెట్లు కనిపించకుండానే మనుషుల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. ప్రధానంగా జనగామ కలెక్టరేట్‌లో పెద్ద వనమై దర్శనమిచ్చే కోనోకార్పస్(ఏడాకుల) చెట్లు లింగాలఘణపురం మండలం నెల్లుట్లలో జాతీయ రహదారికి ఇరువైపులా విస్తృతంగా పెరిగాయి. వర్షాబావ పరిస్థితులను అధిగమిస్తూ స్వల్పకాలంలో ఎదిగిన కోనోకార్పస్ చెట్లు అదే స్థాయిలో ప్రమాదకరంగా మారుతున్నాయని జిల్లా ప్రజలు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దక్షిణ అమెరికాకు చెందిన ఈ మొక్కలు అత్యంత ప్రమాదకరమని, ప్రజారోగ్యానికి పెనుముప్పని, భూగర్భజలాలపై కూడా ప్రభావాన్ని చూపుతాయని ఓ అధ్యయనంలో తేలింది. దీంతో వెంటనే నర్సరీల్లో వాటిని పెంచడం నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. కానీ నాటిన మొక్కలు మాత్రం మూడేళ్లుగా ఏపుగా పెరిగి వాటికి పూతపూసి కాయలు సైతం కాశాయి. అయితే ఇప్పుడు కోనోకార్పస్ కాయలు విచ్ఛిన్నదశకు చేరుకుని పగిలిపోతున్నాయి. దీంతో కాయలు పగిలిన వెంటనే వాటిలో తెల్లని దూది తరహా ధూళి గాలిలో ప్రయాణిస్తూ వాహనదారుల కళ్లల్లో పడుతోంది. ముక్కు ద్వారా ఊపిరితిత్తుల్లోకి చేరుకుంటోంది. అంతేగాకుండా కళ్లల్లో పడ్డవెంటనే విపరీతమైన మంట లేస్తూ వాహనాలు నడపలేక నడిరోడ్డుపై నిలుపుకునే పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పటికైనా అధికారులు వాటిని తొలగించి ప్రజారోగ్యాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కళ్లలో పడ్డప్పుడు మంట పుడుతోంది..



విజయ్‌కుమార్- జనగామ

కోనోకార్పస్ చెట్ల కాయలు పగిలి అందులో నుంచి వెళ్తున్న దూది పింజలు గాలిలో కలిసి నేరుగా వాహనాలపై వెళ్తున్న వారి కళ్లలో పడుతోంది. దీంతో విపరీతమైన మంట పుడుతోంది. కళ్లను నలుచుకోవడం ద్వారా కళ్లు ఎర్రబారి ఇబ్బంది అవుతోంది. అధికారులు వాటిని వెంటనే తొలగించాలి.



చెట్లను వెంటనే తొలగించాలి: కె.శ్రీనివాస్- వడ్డిచర్ల

కోనోకార్పస్ మొక్కల పెంపకం వల్ల మానవాళి మనుగడకు ముప్పు ఉందని ప్రభుత్వం గుర్తించిన వెంటనే వాటిని తొలగించాల్సింది. వాటిని తొలగించడంలో తాత్సారం చేస్తుండటం సరి కాదు. రోడ్ల వెంట నాటిన కోనోకార్పస్ మొక్కలను ఇప్పటికైనా అధికారులు వెంటనే తొలగించాలి. రోడ్ల వెంట పొంచి ఉన్న ప్రమాదాలను నివారించేందుకు కృషి చేయాలి.

విద్యుదాఘాతంతో లేగదూడ మృతి

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 13: మండలంలోని తాటికొండ గ్రామంలో విద్యుదాఘాతంతో లేగదూడ మృతి చెందింది. దాసరి రాజు అనే రైతుకు చెందిన లేగదూడ రోజు మాదిరిగానే ఆయిల్‌పామ్‌తోటలో శనివారం గడ్డి మేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తగిలి షాక్‌తో చనిపోయింది. దాని విలువ రూ.50వేలు ఉంటుందని ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నారు.



మృతి చెందిన లేగదూడను చూపుతున్న రైతు దాసరి రాజు

కొత్త పింఛన్లపై కోటి ఆశలు

- ఎదురు చూస్తున్న దివ్యాంగులు, వితంతువులు, వృద్ధులు
- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- మండలంలో వేయికి పైగా కొత్తగా అర్హులు
- కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించాలని వేడుకోలు



దేవరుప్పుల మండల పరిషత్ కార్యాలయం

దేవరుప్పుల, జూలై 13: దివ్యాంగులు, వితంతువులు, వృద్ధులు నూతన పింఛన్‌కోసం కళ్లల్లో వత్తులేసుకొని ఎదురుచూస్తున్నారు. మండల, పంచాయతీ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లభించడం లేదు. ఇక దివ్యాంగులకోసం ప్రభుత్వం సదరం క్యాంపులు నిర్వహించి అర్హులకు సర్టిఫికెట్లు అందజేసినప్పటికీ, అధికారులు ప్రభుత్వ వెబ్‌సైట్ ఓపెన్ కాలేదని చెబుతున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సదరం క్యాంపులకు హాజరై తెచ్చుకున్న సర్టిఫికెట్లు కూడా కొంతమందివి కాలం చెల్లిపోగా, మళ్లీ క్యాంపులకు హాజరై సర్టిఫికెట్లు తెచ్చుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అయినా ఫించన్ మంజూరు చేయాలని వేడుకుంటున్నారు.

దేవరుప్పుల మండలంలో 32గ్రామపంచాయతీలు ఉండగా ప్రస్తుతం 6490మంది దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు, చేనేత, బీడీ, గౌడ, ఒంటరి మహిళలు ప్రతినెలా ఫించన్లు పొందుతున్నారు. కాగా, ఒంటరి మహిళలు, వితంతువులు పింఛన్ కోసం ఎదురుచూస్తున్నారు. పలుసార్లు మండల పరిషత్తు కార్యాలయం వద్దకు దరఖాస్తు చేయటానికి వెళ్తే సైట్ ఓపెన్ అవడంలేదని, పంచాయతీ కార్యదర్శులకే ఇవ్వండని అధికారులు తిరిగి పంపుతున్నారు. 32మంది పంచాయతీ కార్యదర్శుల వద్ద పలు రకాల పింఛన్లకోసం దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య ఇప్పటి వరకు 1000పైగా ఉన్నట్టు సమాచారం. ఇంట్లో పింఛన్ తీసుకుంటున్న వ్యక్తి చనిపోతే ఆ స్థానంలో కుటుంబసభ్యుల్లో అర్హులైన ఒకరికి అందిస్తున్నారు. కొత్త పింఛన్లు మాత్రం ఇంత వరకు మంజూరు చేయలేదు.

నా సర్టిఫికెట్ కాలం చెల్లిపోయింది..

ఆజ్మీరా సోమ్లీ, దివ్యాంగురాలు, బోడవానితండ, దేవరుప్పుల

2022 ఫిబ్రవరి 23న నాకు సదరం సర్టిఫికెట్ వచ్చింది. రెండేళ్ల గడువుతో 52శాతం పర్సెంటేజీ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో మండల పరిషత్ కార్యాలయం చుట్టూ తిరిగి చెప్పులరిగాయి కానీ పింఛన్ మాత్రం రాలేదు. ఈలోగా సర్టిఫికెట్ కాలం చెల్లిపోయింది. ఎన్నిసార్లు తిరిగినా సైట్ ఓపెన్ కావటం లేదని అధికారులు చెబుతున్నారు. రెన్యూవల్ కోసం దరఖాస్తు చేసుకుని సదరం క్యాంపునకు హాజరై వచ్చాను. ఇంకా సర్టిఫికెట్ రాలేదు.

ఏళ్లు గడుస్తున్నా మోక్షం లేదు..



ధరావత్ రవి, దివ్యాంగుడు, ధరావత్ తండా

జనవరి 24, 2024న సదరం సర్టిఫికెట్ వచ్చింది. డాక్టర్లు 70శాతం పర్సెంటేజీ ఇచ్చారు. అయినా పెన్షన్ రావటం లేదు. అధికారులను అడిగితే సైట్ వస్తలేదని చెబుతున్నారు. కొత్త ప్రభుత్వమైనా తొందరగా స్పందించి మమ్మల్ని ఆదుకోవాలి. వెంటనే పెన్షన్ మంజూరు చేయాలి.

కుటుంబ పోషణ భారమవుతోంది..



జయమ్మ, వితంతువు, సీతారాంపురం

నా భర్త కొమురయ్య అనారోగ్యంతో ఏడాది క్రితం మృతి చెందాడు. వితంతు పెన్షన్‌కోసం గ్రామ పంచాయతీ కార్యదర్శికి దరఖాస్తు ఇచ్చాను. ఇంతవరకు పింఛన్ రావటంలేదు. కూలి నాలికి పోదామంటే ఆరోగ్యం సహకరించడం లేదు. కుటుంబ పోషణ భారం అవుతున్నది. తొందరగా పింఛన్ మంజూరు చేసి ప్రభుత్వం ఆదుకోవాలి.

ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు..



లక్ష్మీనారాయణ, ఎంపీడీవో, దేవరుప్పుల

నూతన పింఛన్ల కోసం ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. దరఖాస్తులు ఆన్‌లైన్ చేద్దామన్నా కూడా వెబ్‌సైట్ ఓపెన్ కావటం లేదు. గ్రామాల నుంచి వచ్చిన దరఖాస్తులను పంచాయతీ కార్యదర్శుల వద్ద ఉంచుకోవాలని చెప్పాం. లాగిన్ ఓపెన్ కాగానే నమోదు చేస్తాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయించాలి

ఎమ్మెల్యే కడియంను కోరిన కృష్ణాజీగూడెం మహిళలు

చిలుపూర్, జూలై 13: మండలంలోని కృష్ణాజీగూడెంలో హెల్త్ సెంటర్ పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఇటీవల మంజూరైన మహిళా కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కేటాయించాలని స్థానిక గ్రామైక్య సంఘం సీఏ వడ్లకొండ రజిత, సభ్యులు కోతి మాధవి, సాదం శైలజ తదితరులు ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కోరారు. ఈ మేరకు శనివారం హన్మకొండలో ఎమ్మెల్యేను కలిసి సమస్యను వివరించారు. 2009లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం హెల్త్ సెంటర్‌తో పాటు, మహిళా సంఘం భవనాల కోసం ఇందిరమ్మ కాలనీలో 80 గజాల చొప్పున మొత్తం 8 ప్లాట్లను కేటాయించిందని, ఇందులో హెల్త్ సెంటర్ నిర్మించారని, ఇక మహిళా సంఘం భవనానికి కేటాయించిన స్థలంలో ఇటీవల కొందరు ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మించేందుకు ప్రయత్నించారని తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి తగిన చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన గ్రామాధ్యక్షులు సాదం భీమన్న, మచ్చ మల్లేష్, సాదం రామరాజు, సాదం శ్రావణి, రాజశేఖర్‌రెడ్డి, ఊరడి రాజు, రఘు, రవిందర్, శ్రీనివాస్, రాజేశ్వరి, రేణుక, లలిత, రాణి, సరిత, కవిత తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కడియంను కలిసిన కృష్ణాజీగూడెం గ్రామైక్య సంఘం మహిళలు

ట్రాక్టర్ బోల్తాపడి ఒకరికి గాయాలు



ప్రమాదంలో బోల్తాపడ్డ ట్రాక్టర్

చిలుపూర్, జూలై 13: మండలంలోని చిన్నపెండ్యాల సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ షరీఫ్‌కు గాయాలయ్యాయి. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం పాంనూర్‌కు చెందిన ఎమ్డీ షరీఫ్ తన ట్రాక్టర్‌పై చిన్నపెండ్యాల నుంచి స్టేషన్‌ఘన్‌పూర్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో హన్మకొండ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో అటు ట్రాక్టర్, ఇటు కారు రెండూ బోల్తాపడ్డాయి. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ షరీఫ్‌కు గాయాలయ్యాయి. కారులో బెలూన్‌లు తెరుచుకోవడంతో అందులో ఉన్నవారికి ఎటువంటి గాయాలు కాలేదని చిలుపూర్ ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపారు.

జన్మదినం సందర్భంగా పండ్ల పంపిణీ

కొడకండ్ల, జూలై 13 : లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ కె.వెంకట్‌రెడ్డి జన్మదిన వేడుకలను స్థానిక సభ్యులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలోని పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కొడకండ్ల క్లబ్ అధ్యక్షుడు రవీందర్, కార్యదర్శి గాజుల రాములు, కోశాధికారి నేతికొండయ్య, ఉపాధ్యక్షులు డి.ప్రభాకర్, పేరం రాము, పసునూరి మధుసూదన్, నర్మెట ఉపేందర్, జక్కుల ప్రభాకర్, ఎం.సోమయ్య, ఉమేశ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ కారిడార్‌గా అభివృద్ధి చేస్తా

వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

మడికొండ, జూలై 13: వరంగల్‌ను ఇండస్ట్రియల్ కారిడార్, ఎడ్యుకేషన్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు. మడికొండలోని సత్యసాయి కన్వెన్షన్‌లో శనివారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు అధ్య క్షతన కడియం కావ్య పరిచయ, ఆత్మీయ సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంపీని, ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు. ఈ సందర్భం గా ఎంపీ కావ్య మాట్లాడుతూ.. తనను ఓరుగల్లు నుంచి ఎర్రకోటకు పంపించేందుకు కృషి చేసిన ప్రతీఒక్కరి కి ధన్యవాదాలు తెలిపారు. తనను అత్యధిక మెజారిటీ తో గెలిపించిన వర్ధన్నపేట ప్రజలకు రుణపడి ఉంటా నన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామగ్రామాన కాంగ్రెస్ జెండా ఎగరేసే విధంగా ప్రతీ కార్యకర్త సైని కుడి వలే పనిచేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో కాళ్లు విరిగిన నరేంద్రమోదీ.. నితీష్‌కుమార్, చంద్రబా బు చేతికర్రల సాయంతో నడుస్తున్నారని ఎద్దేవా చేశా రు. రానున్నరోజుల్లో కేంద్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభు త్వమేనని ధీమా వ్యక్తం చేశారు. వరంగల్ స్మార్ట్ సిటీ పనుల గడువు మరికొంతకాలం పెంచాలని సీఎం రే వంత్‌రెడ్డితో కలిసి కేంద్రాన్ని కోరడంతో గడువు పెరి గిందన్నారు. వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కా రానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు.

ఎమెల్యే కె.ఆర్.నాగరాజు మాట్లాడుతూ.. వర్ధన్నపేట నియోజక వర్గంలో స్థల సేకరణ చేసి బీసీ, ఎస్సీ, ఎస్టీ ఇంటిగ్రేటెడ్ స్టడీ సర్కిల్ మంజూరు చేయిస్తానన్నారు. ఎంపీ కావ్య కేంద్ర మంత్రులను కలిసి ప్రత్యేక శ్రద్ధ తీ సుకోవడంతో మామునూర్ ఎయిర్‌పోర్టు పనులు వేగ వంతంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్ర మంలో డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ ఎంపీ పసునూరి దయాకర్, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రా మిరెడ్డి, రాష్ట్ర ఆయిల్ సీడ్స్ సంస్థ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రుపాషా, హనుమకొండ జిల్లా కిసాన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, వరంగల్ జిల్లా కిసాన్ అధ్యక్షుడు దేవేందర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సారంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, మెట్టుగు ట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, నాయకులు వస్కుల శంకర్, కుర్ల మోహన్, బిల్ల రవీందర్, భైరి లింగమూర్తి, వస్కుల నాగరాజు , కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వంట.. తంటా..!

- మధ్యాహ్న భోజన కార్మికులకు వసతులు కరువు
- నిరుపయోగంగా ఉంటున్న వంట గదులు
- వంట చెరుకు లభించక ఇబ్బందులు
- గ్యాస్ మంజూరు చేయాలని డిమాండ్



ఘన్‌పూర్ హైస్కూల్‌లో పనికి రాకుండా ఉన్న వంట గది

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జూలై 13: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉన్నా వంట చేసి పెడుతున్న కార్మికులు మాత్రం కనీస వసతులు లేక ఇబ్బందిపడుతున్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు తదితర పాఠశాలల్లో మహిళా కార్మికులు ప్రతీ రోజు వంట చేసేందుకు నానా తంటాలు పడుతున్నారు. ఇప్పటికీ అనేక పాఠశాలల్లో వంట గదులు లేవు. కొన్ని చోట్ల వంట గదులు నిర్మించినా ఏమాత్రం అనుకూలంగా లేవు. దీంతో గత్యంతరం లేక ఆరుబయట కట్టెల పొయ్యిలతోనే వంట చేస్తున్నారు. నిలువ నీడ కూడ లేకుండా ఎండలో కూడా వంట చేస్తున్నారు. అయినా పట్టించుకునే వారు లేరని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా గ్రామాల్లో వంట చెరుకు దొరకడం దుర్లభంగా మారింది. ఎక్కడా చెట్లు, చేమలు లేవు. దీంతో వంట చెరుకు కోసం ఇబ్బందులు తప్పడం లేదు. నిత్యం పొగలో వంటలు చేయడం వల్ల తరచుగా అనారోగ్యం పాలవుతున్నారు. మండలంలోని 15 గ్రామాల్లో మొత్తం 33 స్కూళ్లు ఉన్నాయి. వీటిలో 18 పీఎస్‌లు, 6 యూపీఎస్‌లు, 7 హైస్కూళ్లు, ఒక మోడల్ స్కూల్, 1 కేజీబీవీ ఉన్నాయి. వీటిలో 3500 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. జిల్లాలో 508 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో పీఎస్‌లు, యూపీఎస్, హైస్కూళ్లలో పేరుకు వంట గదులు నిర్మించారు. చాలా పాఠశాలల్లో వాటిని వాడడం లేదు. వంట చేయడానికి అవి అనుకూలంగా లేకపోవడంతో మళ్లీ బయటనే వంట చేస్తున్నారు. చాలా చిన్నగా నిర్మించడంతో వాటిలో వంట చేయడం వీలు కావడం లేదంటున్నారు. వాటిని కేవలం వంట గ్యాస్ ఉపయోగించి వంట చేసేలా నిర్మించారని, దీంతో వాటిలో కనీసం వంట పాత్రలు, కట్టెలు పెట్టుకోవడం సాధ్యం కావడం లేదని వాపోతున్నారు. దీంతో కొత్తగా నిర్మించిన వంట గదులు చాలా స్కూళ్లలో వృథాగా ఉంటున్నాయి. కేజీబీవీ, మోడల్ స్కూల్, గురుకులాల్లో వంట గదులు కొంత మెరుగ్గా ఉండగా పీఎస్‌లు, యూపీఎస్‌లు, హైస్కూళ్లలో నిర్మించిన వంట గదులు దాదాపు పూర్తి వృథాగా ఉంటున్నాయి. సుమారు అన్ని పాఠశాలల్లో తరగతి గదుల మధ్యనే బయట కట్టెల పొయ్యిల మీద వంట చేస్తుండడంతో విపరీతంగా పొగ లేస్తున్నది. తరగతి గదుల్లోకి పొగ వస్తున్నది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, వంట కార్మికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.



శివునిపల్లి పాఠశాలలో బయట వంట చేస్తున్న మహిళలు

ఇప్పటికైనా ప్రభుత్వం పాఠశాలల్లో వంట కార్మికులకు వసతులు మెరుగు పరచాలని కోరుతున్నారు. కాగా కార్మికులకు వంట గ్యాస్ మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపి ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన కరువైందని వాపోతున్నారు.

వంట గ్యాస్ మంజూరు చేయాలి..



పద్మ, వంట కార్మికురాలు కార్మికురాలు, ఘన్‌పూర్

ఎండా, వాన, చలి కాలం అనకుండా మండీ, మండని కట్టెలతో పాఠశాలల్లో వంట చేసి వడ్డిస్తున్నాం. పొగతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అంగన్‌వాడీ కేంద్రాలకు ఎప్పటి నుంచో వంట గ్యాస్ ఇస్తున్నారు. వెంటనే మధ్యాహ్న భోజన వంట గ్రూపులకు కూడా వంట గ్యాస్ మంజూరు చేయాలి. అదేవిధంగా కోడిగుడ్ల రేటు పెంచాలి.

అనారోగ్యం పాలవుతున్నాం..



సంధ్య, వంట కార్మికురాలు, శివునిపల్లి

పొగలో వంట చేయడం వల్ల కళ్లు మండుతున్నాయి. శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉంటున్నది. తరచు అస్వస్థతకు గురవుతున్నాం. వంట చేస్తే గౌరవ వేతనం అంతంత మాత్రంగానే ఉంది. అది కాస్తా వైద్యానికే ఖర్చవుతున్నది. ఒక వైపు వంట బిల్లులు, గౌరవ వేతనాలు సకాలంలో రావడం లేదు. కోడి గుడ్డుకు ప్రభుత్వం రూ.5 ఇస్తుండగా రూ.6లు, రూ.6.50లు రేటు పలుకుతున్నది. రేటు పెంచుతూ బిల్లులు పెండింగ్ లేకుండా చూడాలి.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



గూడూరు పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఎస్సై లింగారెడ్డి

పాలకుర్తి, జూలై 13 : మండలంలోని గూడూరులో గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు ఎస్సై లింగారెడ్డి శనివారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ విషయంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులకు వివరించాలని కోరారు. సెల్‌ఫోన్ వల్ల కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఎలాంటి ఇబ్బంది ఎదురైనా 100 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. అదే విధంగా మత్తు పదార్థల వల్ల తలెత్తే అనర్థాల గురించి వివరించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అసిఫా బేగం, సోమిరెడ్డి, రాజ్‌కుమార్, భాస్కర్ పాల్గొన్నారు.

సామాజిక న్యాయవేదిక

జిల్లా ఉపాధ్యక్షుడిగా నారగోని పరమేశ్వర్



చిలుపూర్, జూలై 13 : సామాజిక న్యాయవేదిక జిల్లా ఉపాధ్యక్షుడిగా చిలుపూర్ మండల కేంద్రానికి చెందిన నారగోని పరమేశ్వర్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం న్యాయవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాదం గట్టయ్య యాదవ్ అధ్యక్షుడు నియామక ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ మాట్లాడుతూ పేద ప్రజల సమస్యల పట్ల పోరాడతానని అన్నారు.

మహాసభల కరపత్రాల ఆవిష్కరణ

పాలకుర్తి, జూలై 13 : భారత నాస్తిక సమాజం మూడో రాష్ట్ర మహాసభల కరపత్రాన్ని శనివారం మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర నాయకుడు గుమ్మడిరాజు సాంబయ్య మాట్లాడుతూ ప్రజలందు కూడా మూఢ విశ్వాసాలను విడనాడాలని కోరారు. మహాసభలను హన్మకొండలోని పీ.ఆర్.రెడ్డి భవన్‌లో ఈ నెల 24న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రశాంత్, రవి వర్మ, కాకర్ల కృష్ణ, యాకయ్య, కొండయ్య, శంకర్, ఎల్లయ్య, సోమయ్య, రాజు, సోమచందర్, బొట్ల శ్రీధర్ ఉన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

జఫర్‌గడ్, జూలై 13 : ఆర్థిక కష్టాల్లో ఉన్న చిన్ననాటి స్నేహితుడైన ఈరబత్తిని రామకృష్ణ కుటుంబానికి మండల కేంద్రానికి చెందిన టెన్త్ బ్యాచ్ మిత్ర బృందం ఆర్థిక చేయూతనందించారు. జఫర్‌గడ్‌కు చెందిన రామకృష్ణ తండ్రి కాంతం ఇటీవల అనారోగ్యంతో చనిపోయాడు. దీంతో అతడి కుటుంబ ఆర్థిక పరిస్థితి దయనీయంగా మారింది. జఫర్‌గడ్ జడ్పీ హైస్కూల్‌లో రామకృష్ణతో కలిసి చదువుకున్న 2006-07 టెన్త్ బ్యాచ్ మిత్రులు స్పందించి అతడి కుటుంబానికి ఆర్థిక చేయూతనందించేందుకు నిర్ణయించుకున్నారు. తలా కొంత డబ్బును పోగు చేసుకుని రూ.20 వేలు శనివారం మిత్రుడి ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో మిత్రబృందం ప్రతినిధులు టాకూర్ వివేక్‌సింగ్, సారంగపాణి, కోటి, సంతోష్‌కుమార్, పవన్, ఎల్లస్వామి, పోతరాజు, ప్రభాకర్, రవి తేజ, వెంకన్నగౌడ్, శివ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

జనగామ రూరల్, జూలై 13: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు గద్దం పవన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పవన్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను పరిష్కరించని యెడల పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అభి, సింహాద్రి, రాకేశ్, సాయి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర సంఘం గ్రామ కమిటీ ఎన్నిక



వెంకటమల్లు, కిష్టయ్య

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 13: మండలంలోని ఇప్పగూడెం గ్రామంలో శనివారం వడ్డెర సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శివరాత్రి వెంకటమల్లు, ఉపాధ్యక్షుడిగా శివరాత్రి కిష్టయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా కమిటీల ఆదేశాల మేరకు నూతన కమిటీని ఎన్నుకున్నామన్నారు. రానున్న రోజుల్లో వడ్డెరల సమస్యలపై పోరాటం చేస్తానని తెలిపారు. ప్రభుత్వం గుట్టలపై వడ్డెరలకు హక్కులు కల్పించాలని, క్రషర్‌లు ఏర్పాటుకు రాయితీలు ఇవ్వాలని కోరారు. త్వరలోనే గ్రామంలో పూర్తి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

అనాథాశ్రమ పిల్లలకు అన్నదానం

జఫర్‌గడ్, జూలై 13 : మండలంలోని రేగడితండా పరిధిలోని సాగరం క్రాస్ వద్ద గల ప్రజాదరణ అనాథాశ్రమ పిల్లలకు ఎన్‌ఆర్‌ఐ మామిడాల సాయిచరణ్ శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చిలుపూర్ మండలానికి చెందిన మామిడాల వెంకటేశ్వర్లు-కావ్య దంపతుల కుమారుడైన సాయిచరణ్ అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం ఆయన పుట్టిన రోజు సందర్భంగా ఆశ్రమంలోని అనాథ పిల్లల సమక్షంలో కేక్ కట్ చేసి సంబురాలు జరుపున్నారు. అనంతరం పిల్లలకు అన్నదానం చేశారు. చదువే లక్ష్యంగా ముందుకు సాగాలని పిల్లలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం ఇన్‌చార్జి పూజిత, విద్యార్థులు, పిల్లలు పాల్గొన్నారు.

వరదనీటి సమస్య పరిష్కారానికి చర్యలు

- ఇన్‌చార్జి తహసీల్దార్ విమల

చిలుపూర్, జూలై 13 : చిలుపూర్ గుట్ట అంగడి ప్రదేశంలో నెలకొన్న వరదనీటి సమస్యను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఇన్‌చార్జి తహసీల్దార్ విమల తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశాలమేరకు శనివారం అంగడి (వార సంత) ప్రదేశాన్ని ఆమె సందర్శించారు. జనావాసాల ఎదుట చేరిన మురుగునీరు, చెత్త చెదారాన్ని పరిశీలించారు. స్థానికులతో మాట్లాడారు. వరదనీటి తరలింపు, తీసుకోవాల్సిన చర్యల గురించి వారితో మాట్లాడారు. త్వరలో వెంకటేశ్వర్లపల్లి నుంచి చిలుపూర్ గుట్ట మీదుగా వెంకటాద్రిపేట వరకు బీటీ డబుల్‌రోడ్డు పనులు ప్రారంభం అవుతాయన్నారు. ఈ నేపథ్యంలో జనావాసాల్లో చేరుతున్న వరదనీటిని తరలించేందుకు గాను రోడ్డుకిరువైపులా కందకం (ట్రెంచ్) తవ్వించేందుకు చర్యలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్ఐ కలువల శ్రీనివాస్, పంచాయతీ సెక్రటరీ ఎమ్డీ అజీజ్‌పాషా, పంతం రాజుగౌడ్, నారగోని రవి, పంతం హేమలత, బాల్నె రంజిత్, కల్లూరి శరత్, చంద్రగిరి జమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



చిలుపూర్ గుట్టలో పర్యటిస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్ విమల →

వైభవంగా వేంకటేశ్వరుడి వార కల్యాణం



చిలుపూర్ గుట్ట బుగులు వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం స్వామివారి వార కల్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహిస్తున్న పూజారులు - చిలుపూర్

బదిలీ అయిన ఉపాధ్యాయులకు సన్మానం

జనగామ కల్చరల్, జూలై 13: మండలంలోని వెంకిర్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులను శనివారం ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు బి.చొక్కయ్య అధ్యక్షతన ఉపాధ్యాయులు ఎ.విష్ణు, ఎన్.నరసింహారెడ్డి, బి.నరేందర్‌ను తోటి ఉపాధ్యాయ బృందం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు జి.లక్ష్మి, మాజీ సర్పంచ్ కీర్తి లక్ష్మినర్సయ్య ఆధ్వర్యంలో శాలువాలు, మెమెంటోలతో సన్మానించారు. ఈ సందర్భంగా బాలబాలికలు ఉపాధ్యాయుల ఆశీర్వాదం పొందారు. హెచ్‌ఎం చొక్కయ్య మాట్లాడుతూ బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులు వారు వెళ్లే పాఠశాలల్లో కూడా 100% ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అదే విధంగా పాఠశాలకు నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులు గోపాలకృష్ణ, రవికుమార్, లక్ష్మణ్‌బాబు, అజీజ్‌పాషా, పీడీ కుమారస్వామిని ఘనంగా సన్మానించారు. అనంతరం వారు హెచ్‌ఎం చొక్కయ్యను శాలువాతో ఘనంగా సత్కరించారు.